# మనిషి మృగం

**-పూడిపెద్ది నీలవేణి**

"మమ్మీ..! మమ్మీ! చూడు, చూడు ఈ నల్ల పిల్లి పిల్ల ఎంత లవ్‌లీగా వుందో!"

"అవును మమ్మీ అబ్బ ఎంత ముద్దొస్తుందో! రా! రా! చూద్దుగాని!"

పింకీ, మున్నా ఒకటే గోల డైనింగు టేబిల్ కింద భయం భయంగా చూస్తూ వుంది. అవును! నిజంగానే నల్ల వెల్వెట్‌లా మెరిసిపోతోంది.

స్కూలుకి టైమవుతున్నదని పిల్లలిద్దరికీ కేరేజీలు సర్దుతున్న నేను, వాళ్ళు చేప్పేవరకు దాని ఉనికిని గుర్తించలేదు. ఓ ప్లేటులో కాసిన్ని పాలు పోసి దాని ముందుంచాను. ముందు భయపడినా కాసేపయ్యాక మెల్లగా వచ్చి పాలు తాగి మళ్లీ ఆ బల్లకిందకి పోయి పడుకుంది. నల్ల నేరేడు పండులా ఎంతో బాగుంది. ఎవరో పెంచుకుంటున్నారేమో! తోవ తప్పి వచ్చినట్టుంది. కాని అది మా ఇంట్లో వుండిపోయింది స్థిరంగా!

పిల్లలిద్దరూ స్కూలు నుండి రాగానే "మమ్మీ పుస్సీ (పిల్లలు దానికి పెట్టిన పేరది) ఏదీ?" అంటూ వెతుక్కునేవారు. దాంతోనే ఆడుకునేవారు. వాళ్ల దగ్గర దానికి బాగా మాలిమి అయిపోయింది. అది వాళ్లతో కాలక్షేపం అయిపోయింది. మా ఇంట్లో పనిచేసే గౌరి కొడుకు కూడా దానితో ఆడుకునేవాడు. పనిమనిషి వచ్చినప్పుడు దాని కొడుకు దాంతో వచ్చి నానా అల్లరి చేసేవాడు. కాని పిల్లి పిల్ల వచ్చినప్పట్నుంచి దాంతో ఆడుకుంటూ, వాళ్ల అమ్మకి అడ్డు వచ్చేవాడు పనిచేస్తున్నప్పుడు. నాకు అది బాగానే అనిపించేది.

కొద్ది రోజులకి పిల్లి పిల్ల కాస్తా "పిల్లి" అయిపోయింది. మా ఇంట్లో పోసే పాలు, అన్నం వాటితో పాటు దాని స్వభావ సిద్ధమయిన 'వేట' కూడా చేస్తూ బాగా బలిసి ముద్దొస్తూ తయారైంది. ఎప్పుడూ ఇంటి పట్టునే వుండే పిల్లి పిల్ల పెద్దయ్యాక వీధిలోకి వెళ్లి, తిరిగి రావడం మొదలుపెట్టింది. మరో పిల్లి (గండు) దీనికోసం వస్తూండేది. రెండూ ఒకోసారి పోట్లాడుకునేవి.

మా పిల్లలు కొత్తగా వస్తున్న పిల్లిని చూసి "మమ్మీ! మమ్మీ! మరేం, మరో పిల్లి దీనికోసం - అదే పుసీ కోసం వచ్చి, దాంతో పోట్లాడుతోంది" అంటూ దాన్ని తరిమేసేవారు.

"మీకోసం టింకూ, పింకూ, రీనా వాళ్లు రావడం లేదూ? అలాగే అదీ వస్తోంది దీంతో ఆడుకోడానికి! అది దీని నేస్తం!" అన్నాను.

"భలే! భలే! మంచి దోస్తే!" అంటూ చప్పట్లు కొడుతూ నవ్వారు.

ఓ రోజు ఉదయం నుండి పిల్లి కనపడ్డంలేదంటూ మా పిల్లల కంప్లైంటు!

గౌరి ఉదయాన్నే వచ్చి చంటాడికి బాగా జ్వరంగా వుందనీ, రెండోపూట పనికి రాలేనంటూ చెప్పి వెళ్లింది.

"మందులేమైనా కొన్నావా? డాక్టరుకి చూపించావా?" అనడిగితే, "ఆఁ మామావ - సచ్చినోడు రిక్సా డబ్బులు తాగడానికే సరిపోవమ్మగోరూ! నాకాడ డబ్బులుంటే ఇమ్మన్నాడు - నేవన్నానని నానాగోల సేసి కూడొండుకునే కుండ బద్దలుకొట్టి నానా కూతలు కూసి రిక్సా తోలుకెళ్లిపోనాడండి!" అంటూ కంట తడి పెట్టింది.

"ఎంత పనయిందే! ఏం! నన్నడగలేకపోయావా?" అంటూ దానికి డబ్బులిచ్చి పంపేను మందుకొనమని.

సాయంకాలం 'స్టోర్ రూమ్'లో పనుండి వెళ్లిన నాకు పిల్లి పిల్లల అరుపు సన్నగా వినపడింది. "ఎక్కడా! అని చూసేసరికి సామాను పెట్టుకునే స్లాబు మీద ఓ మూలగా పిల్లి పడుకునుంది. దాని పొట్ట దగ్గరగా ఓ మూడో, నాలుగో పిల్లి పిల్లలు ఓ దానిమీద మరోటి పాకుతూ కళ్లు తెరవని స్థితిలో వున్నాయి. ఆ చీకట్లో పెద్ద పిల్లి కళ్లు టార్చిలైట్లలా వెలుగుతూ కనిపించాయి.

"ఇందుకన్నమాట! పిల్లి ఉదయం నుండి కనపడ్డం లేదు!" స్టోర్ రూంలోకి వెళ్లొద్దని, వెళ్తే పిల్లి కరుస్తుందని, పిల్లలు కాస్త పెద్దవయేక ఆడుకుందురులెమ్మని పిల్లలకి బోధపరిచాను.

వాళ్లు దూరం నుంచి పిల్లి పిల్లల్ని చూసి "మమ్మీ! మనకి మరో త్రీ, ఆర్ ఫోర్ బుజ్జి బుజ్జి పిల్లిపిల్లలు! ఏం?" అంటూ తెగ మురిసిపోయి చప్పట్లు కొట్టేరు ఆనందంతో.

"అవున్రా! కాని వాటి జోలికి పోకండేం! పిల్లి పిల్లలకి కళ్లు విడి కాస్త పెద్దవయితే వాటితో ఎంచక్కా ఆడుకుందురుగాని! ఇప్పుడు ముట్టుకుంటే వాళ్లమ్మకి కోపం వస్తుంది!" అన్నా.

పిల్లలిద్దరూ ఆడుకునేందుకు వీధిలోకి వెళ్లి పోయారు.

ఆ మర్నాడుదయం పిల్లల్ని స్కూలుకి తెమలమని తొందర చేస్తూంటే "మమ్మీ! మమ్మీ! మరో పెద్ద పిల్లి లేదూ! అదే మన పుస్సీ ఫ్రెండూ! మరేమో అదొస్తే మన పుస్సీ దాంతో పోట్లాడింది! దాన్ని భలే తరిమేసింది మమ్మీ!" అంటున్న పిల్లల్తో "తొందరగా తెమలండి! నే చెప్పలేదూ! దాని పిల్లల్ని ఏం చేస్తారో అని దాని భయం! అందుకే దాని ఫ్రెండుతో కూడా పోట్లాట పెట్టుకుంది! చూసేరా? మీరెప్పుడూ స్టోర్ రూం తలుపు తెరవకండి! ఏదైనా కావాలంటే నన్నడగండి" అన్నా. గండుపిల్లి పిల్లి పిల్లల్ని నొక్కేస్తుందని నాకు తెలుసు! కాని ఆ విషయం వాళ్లకి ఎలా చెప్పాలో తెలీక అప్పటికి అలా సర్దిచెప్పాను.

బడి నుండి పిల్లలిద్దరూ రాగానే "బట్టలు మార్చుకుని టిఫిన్ తినండి!" అంటూ టేబిల్ మీద వుంచేను. పిల్లలిద్దరూ టిఫిన్ చేసి ఆడుకుందుకు వెళ్లారు.

సాయంకాలం బాగా చీకటి పడింది. మసక వెన్నెల్లో పిల్లలంతా ఆడుకుంటున్నారు. కరెంటు పోయింది. అగ్గిపెట్ట కోసం స్టోర్ రూములోకి వెళ్లాను టార్చిలైటు పట్టుకుని. పిల్లి పిల్లల సందడి లేదు. "పడుకుని వుంటాయి" అనుకుని అగ్గిపెట్టె తీసుకుని నెమ్మదిగా బయటకొచ్చేశాను.

ఉదయాన్నే కాఫీలయ్యాక పెరట్లో ఏదో పనిచేసుకుంటున్నాను. గౌరి ఇంకా రాలేదు.

"మమ్మీ! మమ్మీ! పుస్సీ ఏమో అరుస్తూ స్టోర్ రూము తలుపు దగ్గరుంది! ఏడుపు వినపడుతోంది మమ్మీ! దాని పిల్లల్ని చూపించవూ! అంటూ గొడవ చేశారు పిల్లలిద్దరూ.

పిల్లి నిజంగానే ఏడుపులాంటి అరుపు అరుస్తూ బయటికీ, లోపలికీ తిరుగుతోంది.

"పిల్లి పిల్లలకు ఏమయుంటుందీ? ఎందుకిలా అరుస్తోందీ!" అనుమానంగా స్టోర్‌రూమ్‌లోకి పోయి చూదునుకదా, ఒక్క పిల్లి పిల్ల కూడా లేదు. రక్తం మరకలు కట్టి వుంది ఆ జాగాలో. ఏదో టైము చూసి గండు నొక్కేసింది. పాపం! అన్ని పిల్లల్ని అదే పొట్టన పెట్టుకుంది.

"పాపం!" అన్నా అప్రయత్నంగా.

"ఏమయింది మమ్మీ, పిల్లి పిల్లలేవీ"? అంటూ పరుగెత్తుకొచ్చారు పిల్లలిద్దరూ.

"చచ్చిపోయాయి, పదండి" అన్నా స్టోర్ రూమ్ తలుపు వేస్తూ.

"ఏం? ఎలాగ?" అంటూ పిల్లలడిగిందానికి "జబ్బు చేసి" అన్నా ఇంకేంచెప్పాలో తోచక.

ఇంతలో గౌరి వచ్చింది హడావుడిగా రొప్పుతూ, ఏడుస్తూ.

"ఏం గౌరీ! ఎలా వుందే మీ పిల్లాడికి?" అన్న నా మాటలకి "ఏటి సెప్పేదమ్మగోరూ. ఆ సచ్చినోడు రేతిరొచ్చి నానా గొడవ చేసి..." అంటూ కంట తడి పెట్టింది.

"ఏం మందుకొని పిల్లాడికి పట్టలేదా? అసలు బాబెలా వున్నాడు?" అన్నా ఆతృతగా.

"మీరిచ్చిన డబ్బులొట్టుకెల్లి మందు కొన్నా. అదే పాక కూసింత తగ్గి చిన్న కునుకు పట్టిందమ్మగోరూ! ఇంతోలకే ఆ ముదనష్టపోడు పుల్లుగ తాగి తూలుకుంటూ వచ్చినాడండి. ఎక్కడ గొడవసేత్తాడో అని 'కూడెట్టి నాను తిని తొంగో!' అన్నదానికి నానా కూతలు కూసి 'ఏటే నంజా నాను కూడు తింటానికే వత్తన్నానా? నువ్వు నా పెళ్లానివి కాదేంటే. ఎప్పుడూ ఆ గుంటెదవని పట్టుకు కూకుంటావేటే?' అంటూ రెక్కొట్టుకున్నాడండీ! మీరు తల్లిలాటోరు, ఆడి మాటలకి నా వొళ్లు సచ్చిపోనాదండీ! సెప్పుకుంటే సిగ్గుసేటు 'సంటోడికి బాగునేదు, నన్నేమనమాక' అంటూ పిల్లాడి దగ్గర తొంగోబోయేనమ్మా! అంతే! సంటోడి రెక్కొట్టుకు ఈదిలోకి యిసిరీసేడు! ఆడి జిమ్మడ! సంటోడి తల రాతికి గుద్దుకుని ఒకటే రకతం! డాక్టరు బాబుకాడికి తీసికెల్లానమ్మగోరూ! ఆడ్నింటికాడ తొంగోబెట్టి మీకాడకొచ్చేను! ఆడెలా గుంటాడోనమ్మగోరూ!" భోరున ఏడ్చింది గౌరి నోట్లో కొంగుపెట్టుకుని.

పిల్లి పిల్లల్ని పొట్టన పెట్టుకున్న గండుపిల్లికి, తన సుఖం కోసం చంటి పిల్లాడిని హింసించిన గౌరి భర్తకి ప్రవర్తనలో తేడా ఏం లేదనిపించింది. తనతో 'జత' కలపలేదని కోపించి పిల్లల్ని చంపిన గండుపిల్లి – గౌరి భర్త ఇద్దరి మనస్తత్వానికి భేదం ఏమిటి? స్వార్థంతో మనిషి పశువుకన్నా హీనమా? రూపంలో తప్ప భావనలో మనిషి మృగం ఒక్కటే అనిపించింది ఆ క్షణంలో నాకు.

బాధపడుతున్న గౌరికి ఏవో రెండు సానుభూతి కబుర్లు చెప్పి కాస్త కాఫీ ఇచ్చి, మరోసారి హెచ్చరికగా అన్నా, "ఏం భయంలేదు గౌరీ! మీ బాబుగారితో చెప్తా – ఆయనకి డాక్టరు బాబు బాగా తెలుసులే! మంచి మందులు, ఇంజక్షన్లు ఇమ్మని చెప్తార్లే! బాబు బాగుంటాడు! బెంగపెట్టుకోకు. వాడు కోలుకునేదాకా పన్లోకి రాకు. నే చేసుకుంటాలే!" అంటూ పంపాను. అంత కన్నా ఏం చేయాలో తోచక.

■